# మీరే భగవత్స్వరూపులు!

చేతులారంగ శివుని బూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తినుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
గలుగనేటికి తల్లుల కడుపుచేటు

ప్రేమాత్మస్వరూపులారా!

ఇది పోతనవ్రాత. అతని హృదయకోకిల కూసిన కూత. యోగత్రయముల మూట. కాండత్రయముల మాట. తరించగోరువారికి యిదే రాజబాట. సకల వేదాంతసారముల మూట. ఇది కేవలము సామాన్యమైన పద్యముగా మనకు గోచరించవచ్చు. ఇందులో అనంతమైన, అగాధమైన వేదాంతసారము ఇమిడిఉన్నది. 'అనంతోవై వేదాః' అన్నారు. అనంతమైన వేదాన్ని అంతముతో కూడిన మానవుడు అర్థము చేసుకోటం అతికష్టము. కనుకనే వ్యాసుడు దీనిని మూడుభాగములుగా విభజించి కాండత్రయములని పేరుపెట్టి, యోగత్రయములని విశ్వసించి అనేకత్వములో ఉండిన ఏకత్వమును గుర్తించే నిమిత్తమై కర్మ, ఉపాసన, జ్ఞానము అనే మూడు మార్గములను అందిస్తూవచ్చాడు.

## త్రికరణశుద్ధి కలిగినప్పుడే జ్ఞానశుద్ధి కలుగుతుంది

'చేతులారంగ శివుని పూజింపడేని', అని ఈ పద్యముయొక్క ప్రారంభము. చేతులతో భగవంతుని అర్చించటము, ఆరాధించటము, పూజించటము, సేవించటము యిత్యాది కర్మలద్వారా హస్తములు పవిత్రము గావాలి. 'నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని'. నాలుక యిచ్చినది ఎందులకు? దివ్యత్వమైన, పవిత్రమైన ఆత్మతత్త్వమును వర్ణించటము కొరకు, దివ్యత్వమును పలుకరించటము కొరకు. "జిహ్వేరసజ్ఞే మధురప్రియే త్వం సత్యం హితం త్వాం. పరమం వదామి". సత్యముతో ప్రేమతో దివ్యమైన వాక్యములతో మానవునియొక్క హృదయము కరిగించి కదిలించటానికి తగిన అవకాశము నందించమని నాలుకను

sri sathyasai vachanamrutam

అందించినాడు. యిక మనస్సుతో భగవంతుని, సత్యస్వరూపుని, నిత్యస్వరూపుని స్మరించి చింతించి తనలో ఐక్యము గావించే నిమిత్తమై మానవునియందు యీపవిత్రమైన త్రికరణములు అందించాడు, భగవంతుడు. వీటిని శుద్ధిగావించుకొనే నిమిత్తమై యీత్రికరణముల యొక్క తత్త్వమును మూడుపదములలో చక్కగా వివరిస్తూ వచ్చాడు, పోతన.

త్రికరణశుద్ధి అనగా ఏమిటి? త్రికమనగా మనోవాక్కాయములు. ఇక్కడ కాయమనగా చేతులతో చేసేపని. ఏవిధమైన కర్మలు ఆచరించాలి? యితరులను ఏవిధముగానూ బాధపెట్టకుండా, హింసించకుండా ఉండే తత్త్వాన్ని మనము అలవరచుకోవాలి. హృదయము రాగద్వేషములతో దూషితముగాని భావములో మనము మునగాలి. హింసాదులతో దూషితముకాని కర్మలు చేతులతో ఆచరించాలి. అసత్యాదులతో దూషితముగాని నాలుకను మనము అనుభవించాలి. ఈ మూడు పవిత్రము గావించుకున్నప్పుడే మానవుడు త్రికరణ శుద్ధి కలిగినవాడౌతాడు. త్రికరణ శుద్ధి కలిగినపుడే జ్ఞానశుద్ధి కలుగుతుంది.

ఈనాడు లోకములో ఎక్కడ చూచినప్పటికిని కేవలము అన్యాయ, అక్రమ, అనాచార, అసత్య, అధర్మమనే పైశాచిక వృత్తులు ప్రళయతాండవము సలుపుతూ ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మనము జగత్తును యేరీతిగా ఉద్ధరించాలి, ఏరీతిగా చక్కపరచాలి, ఏరీతిగా శాంతిని పొందాలి అనే ఆరాటము ప్రతి మానవునియందు కలుగుతూనేఉంది. ఈ ఆవేదన చల్లార్చే నిమిత్తము, యీ ఆనందమును అందుకొనే నిమిత్తము, ఆత్మతత్త్వము గుర్తించే నిమిత్తము మానవత్వము మనకు ప్రాప్తించినదనే సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే యిది సార్థకమవుతుంది. నిజముగా మనము చెప్పటము ఎన్నియో చెబుతున్నాము. చెప్పటం సులభము, వ్రాయటము అంతకంటె సులభము. కాని, అనుభవించటం చాలా కష్టము, ధాతకైన వాని తాతకైన. కనుకనే యీ త్రికరణ శుద్ధిని మనము చేరాలనుకుంటే యీమూడింటి యేకత్వమును మనము అనుభవించాలి. మనోవాక్కాయ కర్మలు. యీ మూడింటి యేకత్వమును మనము చేసినప్పుడే దివ్యత్వమనేది మనయందు ఆవిర్భవిస్తుంది. లేనిదే ఆవిర్భవించటానికి వీలులేదు.

**మానవుని హృదయము భగవంతుని నిలయము**

srisathyasaivachanamrutam

మానవునియొక్క హృదయము భగవంతునియొక్క నిలయము. ఇలాంటి హృదయము ఉండికూడను, పాలసముద్రమువలె ఉండవలసిన హృదయమును మానససరోవరముగా ఉండవలసిన హృదయమును మలిన సాగరముగా, మాలిన్యమైన గృహముగా మనము చేసుకుంటున్నాము. ఇది మానవుని తత్త్వమునకు విరుద్ధమైనది. ఎక్కడ క్షీరసాగరమో అక్కడే శ్రీమహావిష్ణువు పవళిస్తాడు. కనుక, మనహృదయము క్షీరసాగరముగా ఉండాలి. అనగా పరిశుద్ధమై, నిర్మలమై, నిస్వార్థమై పాలసముద్రమువలె ఉండినపుడే అందులో భగవంతుడు పవళిస్తాడు. అప్పుడే 'భగవంతుడు హృదయవాసి', అని చెప్పుటకు మనం అధికారులమవుతాము. 'ఈశావాస్యమిదం సర్వమ్'. అందరియందు భగవంతుడున్నాడని చెబుతున్నాము. కాని, స్వవిషయము వచ్చేటప్పటికి దీనికి విరుద్ధముగా మనము ప్రవర్తిస్తున్నాము. భగవంతుడు సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి అని చెబుతున్నాము. సర్వజ్ఞుడని కూడను చెబుతున్నాము. సర్వజ్ఞునకు మరొక విద్యను నేర్పనక్కరలేదు. తానే సర్వజ్ఞుడు. సర్వజ్ఞత్వములోనే సర్వవిద్యలుకూడను ఉంటున్నాయి. అలాంటి తత్త్వములోపల సర్వజ్ఞుడనే పదమునకు, చక్కగా మనము అర్థము చేసుకుంటే యితనికి విద్యలు అనవసరమనేది సరైన జవాబు వస్తుంది. సర్వవ్యాపకుడు యిక్కడ అక్కడ ఎక్కడ చూసిన ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించినప్పుడు యెక్కడకు పోనక్కరలేదు. అక్కడి వాడు యిక్కడకు రానక్కరలేదు. ఎక్కడ చూచినా ఉండిన భగవంతుడు ప్రయాణము చేయవలసిన అక్కరయేముంది?

## భగవంతునిపై అనురక్తియే భక్తి

అయితే, సర్వత్రా నిండిన దైవత్వమును గుర్తించుటకు కొంతవరకు వ్యక్తిగతముగా ప్రయత్నము చెయ్యాలి. ఏవిధముగా చెయ్యాలి? యీనాడు భక్తి, భక్తి అని చెబుతూ వస్తున్నారు. 'భక్తి' అనగా కేవలము రాగతాళములచేత భజనలు గావించి యిదే భక్తియని భావించుకొనేవారు కొంతమంది ఉంటున్నారు. ధ్యానమనగా ముక్కుమూసుకొని మూలకూర్చుని చీకటిలో తన జీవితమును గడపటమని విశ్వసించే వారున్నారు. జ్ఞానమనగా గ్రంథములు వ్రాయటము, గ్రంథములు చదవటము యిదే జ్ఞానము అని భావించుకునేవారే లోకములో యీనాడు అధికముగా చలామణి అవుతున్నారు. జ్ఞానము అదికాదు. భక్తి యిదికాదు. ధ్యానము అదికాదు.

భక్తి అనగా లోకసంబంధమైన రాగద్వేషములకు లేక దూషణ భూషణములకు చలించక, సమత్వమును వహించి, దివ్యత్వమును వరించి, దైవత్వమును ప్రేమించి తన ఆత్మతత్త్వము తానుపొందటమే నిజమైన భక్తితత్త్వము. భగవంతునిపైన అనురక్తియే భక్తి. ఈ అనురక్తి అనేది ప్రతి మానవునియందుకూడను ప్రతివ్యక్తియందుకూడను ఉంటూనే ఉంది. ఈ భక్తి శక్తినిస్తుంది, భుక్తినిస్తుంది, రక్తి నిస్తుంది, విరక్తి నిస్తుంది, అనురక్తినిస్తుంది, ముక్తినికూడా యిస్తుంది. సర్వశక్తిమయమైనది కాబట్టి యీ భక్తికి యింత విలువనిస్తూ వచ్చారు. యేదోధ్యానము చేస్తున్నాం, భజన చేస్తున్నాం, సాధన చేస్తున్నాం అనుకుంటున్నాం. వీటిద్వారా భగవంతుడు మనకు యేనాటికీ లభ్యముకాడు. చిత్తశుద్ధికి మాత్రమే తాను లభ్యమవుతాడు. ఈ కర్మలన్నీ దేనికోసం వచ్చాయి? శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం. ఈ నవవిధమైన భక్తులను ఆచరించేది ఎందుకోసం? ఈ షోడశోపచారములు యెందుకు మనకు నియమించారు? ఇవన్నియూ కేవలము చిత్తశుద్ధి నిమిత్తమే! కర్మలన్నియు చిత్తశుద్ధి నిమిత్తమై ఏర్పడినవి. చిత్తశుద్ధి కలిగిన తరువాతనే జ్ఞానసిద్ధికి మనము ప్రయత్నించాలి. అయితే, యీ సాధనలంతా భగవదన్వేషణ కోసము చేస్తున్నామనుకుంటారు, చాలామంది.

**సమస్త సాధనలు మానవునియందున్న రాగద్వేషములనే మాలిన్యమును నిర్మూలించే నిమిత్తమే!**

ప్రేమస్వరూపులారా! భగవంతుని అన్వేషణ చేయనక్కరలేదు. భగవంతుడు ఎప్పటికికూడా అక్కడే ఉంటున్నాడు. అతనిని వెతికేది ఎక్కడ? ఎక్కడ చూచినా ఉండే భగవంతుని వెతకటము అనవసరం. ఉన్నది ఒక్కడే, కనుపించేది ఒక్కడే, సర్వత్రా ఉన్నది ఒక్కడే. యీ సాధనలు అన్నీ అతని అన్వేషణకోసము కాదు. మానవునియందు చేరిన రాగద్వేషములనే మాలిన్యములు నిర్మూలించే నిమిత్తము, మన సాధన. ఈ మాలిన్యమును మనము తుడిచి వేసుకుంటే తాను తానుగానే నిల్చుకుంటాడు. తనను పొందటానికి మరి వేరే ప్రయత్నము చేయనక్కరలేదు. నిప్పును మనము అలక్ష్యము చేశాము. అలక్ష్యము చేసేటప్పటికి దానిపైన నివురు కప్పుకుంది. నివురు కప్పుకోటంచేత నిప్పు మనకు కనుపించటము లేదు. నిప్పు కనిపించకపోయినంతమాత్రమున నిప్పులేదని వాదించగలమా? కాదు. కాదు. ఉన్నది, నిప్పు.

sri sathyasai vachanamrutam

దానిపైన చేరిన నివురును తీసివేస్తే నిప్పు కనుపిస్తుంది. అదే రీతిగనే మన హృదయమునందు ఆత్మ అనే సర్వజ్ఞుడైన భగవంతుడు జ్ఞాన భాస్కరునిగా ఉంటున్నాడు. అతనిని అలక్ష్యము చేయటంచేత అందులో మాయ, ప్రకృతి అనే వాంఛలనివురు కప్పబడింది. ఆ కప్పబడిన నివురును తీసివేస్తే నిప్పు కనిపిస్తుంది. అదే సాక్షాత్కారము. ఈ సాక్షాత్కారము ఎక్కడనుండో మనము పొందనక్కరలేదు. మనమే దైవ స్వరూపము. ఎవరికి వారు దైవస్వరూపులే! దైవము ప్రత్యేకముగా లేదు. ఈ దేహమనే దేవాలయములోపల దైవము ప్రతిష్ఠయై కూర్చున్నాడు. కనుక బంగారూ! మీలోపల ఉన్న దైవత్వాన్ని మీరు దర్శించుకొనుటకై తగిన ప్రయత్నము చేయండి. మీరే భగవత్ స్వరూపులు! మీరు ప్రత్యేకమైన వారు కాదు. ఇలాంటి సత్యాన్ని మనము కొంతవరకు గుర్తించాలి.

**భిన్నత్వము దూరమైనప్పుడే రాగద్వేషములను అరికట్టగలుగుతాము**

మానవుడు రెండు పదార్థములయొక్క మిశ్రమ స్వరూపమని అన్నారు. ఏమిటా మిశ్రమము? ఆత్మ, అనాత్మ. జడము, చైతన్యము. క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, దేహము, దేహి మరియు శరీరము, శరీరి. ఈ రెండింటి ఏకత్వముచేతనే మానవత్వము ఉంటుండాది. ఈ రెండింటియందు మనము విభాగము చేసి ఏది సత్యము, ఏది మిధ్య అని గుర్తించడానికి ప్రయత్నించాలి. చాలామంది ఆడవారికి తెలుసు. తిరుగుడు రాయి అంటారు. క్రింద ఒకరాయి, పైన ఒకరాయి ఉంటుంది. క్రిందది స్థిరము, పైది చరము. ఈ చరమైన రాయికి స్థిరమైన రాయి అన్యోన్యాశ్రయము, అవినాభావ సంబంధము. ఒకటి ఉండి ఒకటి లేకపోతే మనకు పని జరగదు. క్రింద స్థిరమైన రాయి ఉండాలి. పైన తిరిగే రాయి ఉండాలి. ఈ మధ్యలోపలనే ఏదో కొన్ని పదార్థములు powder గా తయారౌతాయి. యీ స్థిరము, చరము అనే దాంట్లో యేది స్థిరము, యేది చరము అనే సత్యము మనము గుర్తించడానికి ప్రయత్నించాలి. ఆ విచారణ శక్తికే మీమాంస అని, విచారణ అని, నిత్యానిత్య విషయ పరిశీలన అని అనేకరకములుగా పండితులు పేర్లు పెడుతూ వచ్చారు. 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ'. అందరియందు ఉండినటువంటిది ఒకే భగవంతుడు. 'ఏకమ్ సత్ విప్రాః బహుధా వదంతి'. ఈ విప్రులు, ఋషులు ఒకే పదార్థమును వారి వారికి తోచినట్టుగా పేర్లు పెట్టుకుంటూ పోయారు.

sri sathyasai vachanamrutam

ఎన్ని పేర్లు పెట్టుకున్నప్పటికిని, ఎన్ని రూపములు మార్చినప్పటికిని, ఎన్ని విధముల అనుభవించినప్పటికిని దైవత్వము ఒక్కటే! ఒక్కటే, ఒక్కటే! ఈ ఏకత్వమును మనము అనుభవించాలి. ఈ ఏకత్వమును మనము విశ్వసించాలి. అప్పుడే భిన్నత్వము మనలో దూరమవుతుంది. భిన్నత్వము దూరమైనప్పుడే యీ రాగద్వేషములను కొంతవరకు అరికట్టినవారమవుతాము.

**దేహినిబట్టియే దేహమునకు విలువ**

ఈనాటి మానవుడు కేవలము స్వార్థము, స్వప్రయోజనములచేతనే జీవిస్తున్నాడు గాని త్యాగము, విశాలము అనే భావము ఎక్కడా కనుపించటము లేదు. మానవుడు అనే పదముయొక్క అర్థమును, నరుడనే పదముయొక్క అర్థమును చక్కగా మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. నరః అంటే ఏమిటి? రః అనగా అస్థిరము. నరః అస్థిరము కానిది. కాబట్టి, మానవుడు అమృతపుత్రుడు. అస్థిరము కాదు. ఉపనిషత్తులు 'శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రః' అని మానవుని నిజతత్త్వమును ఎఱుకపరచాయి. మానవుడు అమృతపుత్రుడు. దేహము కేవలము కొంతవరకు రాలిపోవచ్చు. కూలిపోవచ్చు, కాలిపోవచ్చు. కాని తాను నిజంగా ఆత్మస్వరూపుడే!

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ యీ**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

దేహి ఉండటంచేతనే దేహము సర్వవిధముల పనిచేయకలుగుతున్నది. దేహియే లేకపోతే దేహము క్షణమైనా ఉండటానికి వీలులేదు. దేహిని బట్టి దేహమునకు విలువ యిస్తున్నామే గాని దేహాన్ని బట్టి దేహికికాదు. ఈ సత్యమును మొట్టమొదట గుర్తించాలి. ఆడవారికి అందరికి తెలుసు. మైసూర్‌పాక్, గులాబిజాం, బర్ఫీ, పాలకోవ, మిఠాయి, జిలేబి అనేక తీపి పదార్థములు చేస్తాము. ఈ అన్నింటిలో ప్రధానమైన వస్తువు ఏమిటని విచారిస్తే చక్కెర ఒక్కటే! ఈ చక్కెర లేకపోతే గులాబిజాం లేదు, మైసూర్ పాక్‌లేదు. చక్కెర అన్నిటియందు సమత్వముగా రూపొంది యీ ఏకత్వమును విశ్వసింపచేస్తున్నది. అదేవిధముగనే మానవునియొక్క రూపనామములు

వేరుగా ఉండవచ్చు. వారియొక్క సిద్ధాంతములు వేరువేరుగా ఉండవచ్చును. వారి ప్రవర్తనలు వేరువేరుగా ఉండవచ్చును. కాని, అందరియందు ఉండిన ఆత్మతత్త్వము ఒక్కటే! ఆ దివ్యత్త్వమును మనము విశ్వసించాలి. ఆ దివ్యత్వమును విశ్వసించకపోవటము చేతనే మనము అనేక అవస్థలకు గురైపోతున్నాము. కారణమేమిటి? తనస్వరూపమును తను గుర్తించుకునే సమయమునందే సత్యాన్ని చక్కగా అర్థము చేసుకోగలదు. కనుక యీ సత్యాన్ని మనము గుర్తించాలనుకుంటే మొట్టమొదట ఏకత్వములో ఉన్న అనేకత్వమును విచారణ చెయ్యాలి.

**ఆత్మవిశ్వాసమే నిజమైన బలము**

ఈనాడు జగత్తునందు యితను ధీరుడు, యితను వీరుడు యితను గంభీరుడు అంటుంటాం. మన ధీరత్వము యెక్కడుంటున్నాది? ఆత్మ విశ్వాసమే నిజమైన ధీరత్వము. ఆత్మవిశ్వాసమే నిజమైన బలము. దేహము ఎంత బలముగా ఉండినప్పటికిని, బుద్ధి ఎంత చురుకుగా ఉండినప్పటికి, తెలివితేటలు ఘనముగా ఉండినప్పటికిని ఆత్మవిశ్వాసమే లేకపోతే అన్నికూడను వ్యర్థమే! 'నేను', 'నేను', 'నేను', అని యీ నేను అనే పదమును ప్రతిదానికి మనము ఉపయోగపెడుతున్నాము. ఆ 'నేను' ఎవరు? ప్రతిమానవుడు తెల్లవారిమొదలు రాత్రివరకు 'నేను వచ్చాను', 'నేను పోయాను', 'నేను చూచాను', 'నేనుతిన్నాను', 'నేను నడచాను' అంటూ 'నేను' అనే పదమును తరుచు ఉపయోగపెడుతున్నాడు. ఈ 'నేను' ఎవరు? 'ఇది నాదేహము'. 'ఇది నాబుద్ధి', 'ఇది నా చిత్తము', 'నా అంతఃకరణ' అనుకుంటున్నాము. నాది నాది అనుకున్నప్పుడు 'నేను ఎవరు', అని ఎవరైనా ప్రశ్నించుకుంటున్నారా? ఇది నాటవల్ అన్నప్పుడు టవల్ వేరు, నేను వేరు. అదే రీతిగా నాదేహము అనుకుంటే దేహము వేరు, నేనువేరు. నేను ఎవరు? ఈ యొక్క చిన్న విషయము గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. నేను అనేది నిజమైన దైవత్వము. ప్రపంచములో మనము పుట్టిన తక్షణమే ఏపదార్థమును, ఏ విషయమును, ఏ వ్యక్తిని గుర్తించక పూర్వమే నేను అనేది మొట్టమొదట పుడుతున్నాది. అదే 'అహం'. ఈ అహం తత్త్వమునుండియే మనసు పుడుతున్నాది. మనస్తత్త్వమునుండియే తలంపులు పుడుతున్నాయి. తలంపుల నుండియే వాక్కు పుడుతున్నది. కనుక వాక్కు, తలంపు, మనస్సు అన్నీ కూడను ఆత్మ సంబంధమైనవే! ఈ అహం అనేది దేహమునకు మనము

ఉపయోగించుకోరాదు. వాక్కు అనేది నాలుకకు మాత్రమే సంబంధముకాదు. తలంపు అనేది మెదడుకు మాత్రమే సంబంధము కాదు. ఇవన్నీ కూడను ఆత్మతత్త్వమునుండి ఆవిర్భవించినవి. ఒక తండ్రికి ఒక కుమారుడు పుట్టాడు. ఆ కుమారునికి మరొక కుమారుడు పుట్టాడు. ఆ కుమారునికి మరొక కుమారుడు పుట్టాడు. తండ్రి, కొడుకు, మనుమడు, మునిమనుమడు యీ సంబంధమంతా ఒక కుటుంబమునకు సంబంధించినదే కదా! అదే రీతిగనే ఆత్మనుంచి అహము, అహమునుంచి మనసు, మనసునుండి తలంపులు, తలంపునుంచి వాక్కు, యివన్నీ ఒకే ఆత్మయొక్క కుటుంబమే! ఈ కుటుంబముయొక్క ఏకత్వమును చక్కగా గుర్తించుకుంటే ఒకరికొకరికి భేదము ఎక్కడ వస్తుంది? రాగద్వేషములకు అవకాశము ఎక్కడ ఉంది? కనుక, మనమందరముకూడను భగవంతునియొక్క బిడ్డలమనే సత్యమును గుర్తించాలి. తండ్రి ఒక్కడే! బిడ్డలు ఎంతమందైన ఉండవచ్చు. అందరికి కూడను ఆ తండ్రియొక్క ప్రాపరిటీ సమముగా భాగమైపోతుంది. ఆత్మలోనే మనము జీవించాలి. ఆత్మయందే ఆనందించాలి. ఆత్మయందే మనము అంత్యము కావాలి. ఇదే నిజమైన బ్రహ్మత్వము.

**మానవదేహమునందే దివ్యత్వము గోచరిస్తుంది**

దైవత్వమును మనము గుర్తించుకోవాలంటే దూరము పోనక్కరలేదు. మన దేహమును మనము చూచుకుంటే చాలు. ఈ దేహములోని సర్వాంగములయొక్క ఏకత్వము యెంత చక్కగా ఉందో చూడండి. ఒక చెట్టుపైనున్న పండును కన్ను చూచింది. కన్ను చూచిన తక్షణమే ఆ చెట్టుపైనున్న ఫలము మనకు వచ్చి చేరుతున్నాదా? చేరటం లేదు. కానీ ఆశ ఆశిస్తున్నాది. ఈ ఆశవల్ల కాళ్లు అక్కడకు మెత్తగా కదులుతాయి. కాళ్లు కదలిన తక్షణమే మనకు ఆ పండు లభించటం లేదు. తిరిగి నడుము వంగుతుంది. నడుము వంగినంత మాత్రమున పండు మనకు లభించదు. చేయి రాయిని తీసుకుంటుంది. రాయిని తీసుకున్నంత మాత్రమున పండు లభించటము లేదు. భుజము దానిని పట్టి విసురుతుంది. అప్పుడు ఆ రాయి తగిలి పండు క్రింద పడుతుంది. క్రిందపడిన తక్షణమే మనకు లభించటంలేదు. తిరిగి వేళ్లంతా ఆ ఫలమును పట్టుకుంటున్నాయి. పట్టుకున్నంత మాత్రమున కడుపుకు చేరటంలేదు. అది తీసి నోటికి అందిస్తుంది. నోటికి అందించినంత మాత్రమున నోరు అనుభవించటము లేదు. నోరు రుచి

sri sathyasai vahamrutam

చూస్తుంది. మంచిదా చెడ్డదా విచారణ చేస్తుంది. మంచిదైతే లోపలికి పంపుతుంది, చెడ్డదైతే బయటకు పంపుతుంది. అయితే జఠరాగ్నికి చేరటానికి యే యే అంగములు పనిచేశాయి? సర్వాంగములయొక్క సహకారమే యీ యొక్క చెట్టుపైనున్న ఫలము పొట్టలో చేరటానికి కారణమైంది. చూశారా ఏ ఒక్క అంగము సరిగా ఒకదానికొకటి అనుసరించకుండా పోతే చెట్టుపై ఉన్న పండు పొట్టలో చేరటానికి వీలులేదు. ఈ విధమైన సమత్వమును, సహకారమును యీ అంగములన్నీ పొందటంచేతనే చెట్టుపైనున్న ఫలము మన పొట్టలో చేరుతున్నాది. 'అయ్యో! యిన్ని అంగములు కదా నాకు సహాయము చేసి నాకు జఠరాగ్నికి పంపించింది! కనుక, వీటన్నింటికి కృతజ్ఞత చెప్పాలి', అనే సద్భావము చేత, సత్ప్రాదయముచేత ఆ జఠరాగ్ని యేమి చేస్తుంది? పిప్పిని బయటకు పంపుతుంది. సారమును సర్వాంగములకు సప్లై చేస్తుంది. చూశారా! ఒకరికొకరు అన్యోన్య అనురాగములతో ఉండినప్పుడు, యీ విధమైన సహకారముతో ఉండినప్పుడు ఎంత దివ్యమైన సహకారము చూపిస్తున్నది, మన దేహము. దేహములోనే ఉంటున్నది సహనము. దేహములోనే ఉంది సానుభూతి. దేహమునందే ఉంది ప్రేమతత్త్వము. దేహమునందే ఉంది త్యాగభావము. ఇవన్నీ మానవునియందే ఉన్నవిగాని మరియెక్కడో లేవు.

**పాపమనగవేరు పరదేశమున లేదు**
**తాను చేయు పనుల తగిలియుండు**
**దేవుడనగ వేరు దేశమందున లేడు**
**తాను చేయు పనుల తగిలియుండు**

దేవుడుగానీ, పాపముగానీ అంతా మన కర్మలలోనే ఉంటున్నాది. మన కర్మాచరణలోనే ఉంటున్నాది. కనుకనే 'యద్భావం తద్భవతి'. ఒక అద్దముముందు పోయి నిల్చుకున్నాము. ఒక నమస్కారము చేశాము, ప్రతిబింబానికి. ఈ నమస్కారము యెక్కడికి పోయింది? తిరిగి ఆ నమస్కారము మనకే వాపసు వచ్చింది. ఆ నమస్కారము తిరిగి మనకే వచ్చి చేరిపోయింది. లేక, అద్దములో ఉన్న ప్రతి బింబమును దండించినామా ఆ ప్రతిబింబము మనలనే దండిస్తున్నాది. ఏది చేసినా యేది చూచినా, యేది చెప్పినా అన్నింటికిని Reaction, resound, reflection. కనుకనే భారతీయులు కర్మఫలసిద్ధాంతమును విశ్వసిస్తూ వచ్చారు.



sri sathyasai vachanamrutam

కనుకనే మంచి చేయాలి. మంచి చేసి మంచి ననుభవించాలి.

**త్యాగము చేయకపోతే రోగము వస్తుంది**

మంచి చూసి మంచిననుభవించాలి. ప్రపంచములోపల ప్రతి విషయమునందుకూడను త్యాగము అత్యవసరము. త్యాగమే లేకపోతే యోగమే లేదు. యోగమే లేకపోతే మనకు నిజమైన ఆనందమే లభించదు. ఈనాడు త్యాగము చేయకుండా పోవటంచేతనే రోగాలకు గురైపోతున్నాము. త్యాగమువల్ల యెంత క్షేమము ఉంటున్నాది! నిత్య జీవితములో నిత్యానుభవములో తెల్లవారి మొదలు రాత్రి వరకు అనుభవించే కర్మలలో మీరు చక్కగ గుర్తించుకోవచ్చు. మనము ఒకవైపున ఫలములు భుజిస్తున్నాము. భుజించిన ఫలము తిరిగి మలరూపములో త్యాగము చేయకపోతే కడుపు చెడిపోతుంది. చూశారా! ఒకవైపున లోడ్ చేశాము. యింకో వైపున అన్‌లోడ్ చేయాలి. లేకపోతే మన ఆరోగ్యమే పాడైపోతుంది. ఇక గాలి పీల్చుకుంటున్నాము. పీల్చుకున్నగాలి తిరిగి వదలకపోతే ఊపిరితిత్తులు చెడిపోతాయి. త్యాగములోపల యెంతక్షేమం వచ్చింది, చెప్పండి! ఇక్కడ మన చేతిలోపల ఫలానిచోట రక్తము ఉంది. ఈ రక్తము క్షణక్షణమునకు ఆస్థానము వదలిపెట్టి పోతుండాలి. అప్పుడే బాగా క్షేమంగా ఉంటుంది. ఆ స్థానము వదలిపెట్టకుండా పోతే అక్కడ ఒక గుల్లగా తయారైపోతుంది. రోగము వస్తుంది. త్యాగము చేయకపోతే రోగము వస్తుంది. త్యాగములో ఒక యోగము వస్తుంది. భోగము వస్తుంది. కనుక, నిజమైన త్యాగములోనే మన ఆనందము యిమిడి ఉంటున్నాది. ప్రతి దానిలోను కొంతవరకు త్యాగానికి మనము పూనుకోవాలి. 'పరోపకారార్థమిదం శరీరమ్' అన్నారు. ఎక్కడ చూచినా పరోపకార నిమిత్తమై చెట్లంతా కూడను మనకు ఫలాన్ని అందిస్తున్నాయి. పరోపకార నిమిత్తమై తన బిడ్డ కడుపుకూడ కొట్టి పాలు అందిస్తున్నాయి గోవులు. పరోపకార నిమిత్తమై నదులు తమనీరు తాము త్రాగకుండా యితరులకు దాహం తీర్చటము, పంటలు పండించటం చేస్తున్నాయి. ఈనాడు మానవునికి మాత్రమే అట్టి త్యాగము లేదు. ఏది చిక్కినా యింకా కావాలి, కావాలి. పుచ్చుకోటమే తప్ప వీనిలో యెక్కడా యిచ్చుకోటమనే త్యాగము కనుపించటంలేదు. అదియే యింత అశాంతికి మూలకారణము. అదే మన దుఃఖమునకు మూలకారణము. ప్రతిదీకూడను ఏనాటికైనా ఒకనాడు వదిలిపెట్టవలసివస్తుంది.

srisathyasaivachanamrutam

**మలినపుకొంప రోగముల (మ్రగ్గెడు సేవక గంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బుల పొది లెమ్ము చూడ మనమెచ్చు దలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే!**

ఈ దేహతత్త్వము యెంతకాలము? నీటి బుడగవంటిది. ఏనిమిషమో, ఏక్షణమో, ఎక్కడో ఎప్పుడో చెప్పటానికి వీలులేదు. భవిష్యత్తునుగురించి మనము యోచించనక్కరలేదు. ఎందుకంటే భవిష్యత్తు మన చేతిలో లేదు. రేపు రేపంటే రేపటివరకు నీవు ఉండేది ఖాయమేమిటి? కనుక, రేపు అనేదానికి యేమాత్రము చూచుకోకూడదు. గడచిపోయిన దానికి చింతించి ప్రయోజనము లేదు. నడచుకొని వచ్చినరోడ్డు చూచుకొనే వచ్చావు. మరి ముందుకు చూడాలిగాని వెనుకకు యెందుకు చూడాలి?

**మానవత్వము త్యాగమునకే వచ్చింది**

వర్తమానమును మనము లక్ష్యములో పెట్టుకొని యెప్పుడు చేయవలసిన పనులు అప్పుడు చెయ్యాలి. దీనినే చక్కని పద్యముగా చెప్పాడు వేమన. చిన్నచిన్న పదములలోపలనే, చిన్నచిన్న వాక్యములలోపలనే యెంతో అమోఘమైన అర్థములు యిమిడ్చిన పవిత్రమైన వాక్యములు, భారతీయ పండితులయొక్క అనుభూతులు. అలాంటి పరిస్థితిలోపల మనము యెంత చిన్నగా ఉంటున్నాము చెప్పండి. ఇంత చిన్న విషయములోకూడను గొప్ప అనంతమైన అర్థమును యిమిడ్చారు. ఎవరిని నొప్పించకుండా యేవిధమైన బాధలు పెట్టకుండా మనము తప్పించుకొని తిరగటానికి తగిన యుక్తులు సాధించాలి. 'యుక్తికూడను ఒక యోగము', అన్నారు. కనుక, మానవులు యీ త్యాగ విషయములోపల అతి జాగ్రత్తను వహించాలి. ఒక చిన్న విషయము, మనము బ్యాంకులో డిపాజిట్ పెట్టాము. అది మనడబ్బే! చెక్‌బుక్ మనదగ్గరే ఉంటుందాది. ఉండినప్పటికి నీవు పోయి అడుగుతే బ్యాంకు మేనేజరు నీకు డబ్బు యివ్వడు. చెక్కు యిస్తే డబ్బు యిస్తాడు. ఒకదానిని యిచ్చినప్పుడే మరొక దానిని పుచ్చుకొనేందుకు అవుతుంది. చిన్నచిన్న విషయములలో కూడను త్యాగము మనకు గోచరిస్తుంది. ఒక షాపుకు మనం పోయాము, ఆ shop keeper కు ఒక ఐదు రూపాయలు ముఖమున కొడితే వాడు మన

sri sathyasaivachanamrutam

ముఖాన hand kerchief కొట్టేస్తాడు. నువ్వు డబ్బులు యివ్వకపోతే ఆ బట్ట మనకు రాదు కదా! ఈ లౌకికమైన జగత్తులోపల ఒక దానిని మనము త్యాగము చేసినప్పుడే మరొకదానిని అందుకోగలుగుతున్నాము. ఇంక అనంతమైన, మహా విలువైన,శక్తి సంపన్నమైన దివ్యత్వమును అందుకోవటానికి త్యాగము చేయకపోతే మనకి యేరీతిగా లభిస్తుంది? వీలుకాదు. అశాంతిని త్యాగము చేస్తేనే మనకు ప్రశాంతి లభిస్తుంది. అనేకత్వమును త్యాగము చేసినప్పుడే ఏకత్వము మనకు ప్రాప్తిస్తుంది. భిన్నత్వము పోయినప్పుడే ఏకత్వము మనకు లభిస్తుంది. ప్రతి ఒక్కదానికి కూడను త్యాగము చేయాలి. త్యాగము చేయకుండా పోవటానికి వీలులేదు. కనుకనే మానవత్వము త్యాగముతో వచ్చినది.

ప్రేమ స్వరూపులారా! మీరు యెంతో త్యాగము చేసి ఎన్నో విధాల ఉత్సాహముతో, ప్రోత్సాహముచేత యీ ప్రదేశమునకు వచ్చి చేరారు. అయితే దైవతత్త్వమే మనకు ప్రధానమని గుర్తించాలి. జీవితములో ఎన్నో సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కానీ ఎప్పటికేది ప్రస్తుతమో అప్పుడు దానిని మనము చూచుకోవాలి. ఇది present అంటారు. ఈ present కేవలము సామాన్యమైన present కాదు, ఇది omnipresent. భవిష్యత్తుయొక్క బీజము దీంట్లో ఉంది. వర్తమానముయొక్క ఫలితము దీంట్లో ఉంది. భూతకాలముయొక్క ఫలితము దీంట్లో ఉంటుండాది. చూశారా! ఏవిత్తనము నాటామో ఆ మొక్కనే తిరిగి వస్తుంది. పూర్వము ఆ విత్తనము నాటుకోటంచేత ఆమొక్క యిప్పుడు వచ్చేసింది. ఏ అన్నము తిన్నామో దానిత్రేపే వస్తుంది. మామిడి పండు తింటే దోసకాయ త్రేపు వస్తుందా? ఎప్పటికి కాదు. ఈనాడు ఏమిచేస్తామో భవిష్యత్తులో అదే మనకు ఫలితము వస్తుంది. కనుక యీ వర్తమానమును లక్ష్యములో పెట్టుకొని చక్కని కార్యాలు, పవిత్రమైన భావములు, పవిత్రమైన మాటలు, పవిత్రమైన పనులు మనము చేయటానికి ప్రయత్నించాలి.

**నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు, అదే గొప్ప సాధన**

ప్రేమస్వరూపులారా! దేనిని నమ్మినా నమ్మకపోయినా మనకు వచ్చే నష్టము యేమీలేదు. కాని, భగవంతుని నమ్మకపోతేమాత్రం మనము చాలా నష్టపోతాం. భగవంతుడు సర్వత్ర ఉంటున్నాడు. మీరంతా భగవత్ స్వరూపులే! మిమ్మల్ని మీరు నమ్ముకోకుండా ద్రోహం

srisathyasaivachanamrutam

చేసుకుంటున్నారు. మీకు మీరు ద్రోహం చేసుకుంటున్నారు. భగవంతునికేమీ నష్టము లేదు. అనగా తనను తాను నమ్మినవాడే జగత్తులో జీవించగలడు. తనని తాను నమ్మనివాడు ఒక్క క్షణమైనా జీవించటానికి అవకాశము ఉండదు. కనుక, మిమ్మల్ని మీరు నమ్మండి. అదే భగవంతునిపై నమ్మకం. ఇక్కడకు పొండి, అక్కడకు పొండి, ఈ పూజ చేయండి అని యిట్లాంటివంతా నేను ప్రబోధించను. మిమ్మల్ని మీరు నమ్ముకొని 'నేను సత్యమార్గములో ప్రవర్తించాలి', అనే దీక్షను పట్టిన అంతకంటె గొప్పసాధన, అంతకంటె గొప్ప తపస్సు, అంతకంటె గొప్ప విజ్ఞత లేదు. కనుక, మనము ఏసాధనలు చేయనక్కరలేదు. ఏ పూజలు చేయనక్కరలేదు. నీకర్తవ్యము నీవు నిర్వర్తించు. మీరు గృహస్థులుగా ఉంటున్నారు. మీ బిడ్డలను, భార్యను, భర్తను ఒకరికొకరు పోషించుకొని, ఎవరిపైనా ఆధారం లేకుండా అధర్మమార్గములో ప్రవేశించకుండా, అక్రమాల్లో ప్రవేశించకుండా మీకర్తవ్యమును మీరు నిర్వర్తిస్తే యింతకంటె తపస్సు వేరేలేదు. తపస్సనగా ఏమిటి? ఏదో అరణ్యమునకు పోవటము, ఆకులలములు మేయటం, తలక్రిందకు కాళ్ళుపైకి పెట్టి నించోవటం యిదికాదు తపస్సు. అడవిలోకి పోయినప్పటికి మన మనసు వచ్చి వూర్లో తిరుగుతూ ఉండవచ్చు. దీనివల్ల యేమి ప్రయోజనం? యింటిలో ఉండినప్పటికి మన మనస్సును స్వాధీనములో పెట్టుకుంటే యిదే అరణ్యం, యిదే నిజమైన ఏకాంతము, ఇదే నిజమైన ఆనందము. కనుక, యీ విధముగా మన కర్తవ్యమును మనము నిర్వర్తించాలి. ఎవరికి మనము చెడ్డమాటలు చెప్పకూడదు. ఎవరిని ఏమీ అనకూడదు, బంగారూ! అందరియందు భగవంతుడే ఉంటున్నాడు. ఎవరిని మనము దూషించినా భగవంతుని దూషించినట్లే అవుతుంది. ఎవరైనా చెడ్డ మాటలు చెబితే అవి మనము వినకూడదు. అవి వినటములో శ్రవణదోషము కలుగుతుంది. ఒక చిన్న ఉదాహరణము. మీకందరికి తెలుసు.

**చెడ్డమాటలు చెప్పటము, వినటము, రెండూ దోషములే!**

మంథరవచ్చి శ్రీరామునిపైన ఓర్వలేక అనేకరకములైన చాడీలు చెప్పినప్పుడు అతి ప్రీతితో గారాబంగా పెంచిన రామునిపైనకూడను కైక మనసు చాలా విరిగి పోయింది. చెడ్డమాటలు చెప్పటంవలన మంథరగతి యేమైంది? ఎన్ని కష్టములకు గురైపోయింది! అలాంటి స్త్రీలయొక్క పేర్లు ఎవరైనా ఆడవారు పెట్టుకుంటున్నారా, 'మంథర' అని. ఎవ్వరూ పెట్టుకోరు. కారణం,

sri sathyasai vahanamrutam

అలాంటి చెడ్డమాటలు చెప్పే వారిపేరు మనకు ఉండకూడదు అని మనము అంటున్నాము. తిరిగి ఆ చెడ్డపనులలో మనము ప్రవేశించము. చూశారా! చెడ్డ మాటలు వినింది కైక. మహారాణి వాసములో ఉండిన ఆమె. కాశ్మీరు రాజకుమార్తె, దశరథ మహారాజు పట్టపురాణి. శ్రీరామచంద్రునకు విలువిద్య నేర్పినది కైకయే! తన కుమారుడైన భరతునికంటె శ్రీరాముని ఎంతో ప్రీతిగా చూచుకొనేది. అలాంటి రామునిపైననే ఆమెకు మనసు విరిగింది. దేనివల్ల? చెడ్డమాటలు వినటంచేత. స్వార్థము, స్వప్రయోజనము ఆధారముగా తీసుకోటంచేత ఆమెయొక్క గతి యీరీతిగా అయిపోయింది. ప్రపంచమంతా నిందించింది ఆమెను. చూడండి. నిందించటమేకాదు ఆకైక చెడ్డమాటలు వినటంవలన ఎవరైనా ఆడవారు కైక పేరు పెట్టుకుంటున్నారా? ఆడవారిలో కైక, మంథర అనే పేర్లు లేవు. కారణమేమిటి? చెడ్డ మాటలు చెప్పటము, చెడ్డమాటలు వినటము యీరెండు దోషముల వలననే ఆపేరు ఎవరూ పెట్టుకోకూడదని త్యజించారు. తరువాత, చెడ్డ తలంపులు తలచటము. ధర్మమూర్తులైన పాండవులపైన అధర్మ, అన్యాయ, అక్రమ, అనాచార సంపన్నులైన కౌరవులకు నిరంతరము చెడ్డ తలంపులే! వారిని చెడగొట్టటానికి తగిన ప్రయత్నములే! లక్క గృహములోపెట్టి అగ్నిపెట్టటము, విషము భుజింపచేయటము, యీ విధముగా వారు చెడ్డను తలంచుచూ వచ్చారు. హృదయములో నిరంతరము చెడ్డ తలంపులు ఉండటంచేతనే ఆ దుర్యోధన, దుశ్శాసనాదులందరూ దుర్గతిని పొందారు. వారిపేర్లు ఈనాడు ఎవరైనా పెట్టుకుంటున్నారా? ఎవ్వరూ పెట్టుకోటం లేదు. కారణం ఏమిటి? చెడ్డ సంకల్పములు కల్గినవారు, చెడ్డ తలంపులు కల్గినవారు ఆ దుష్టులపేర్లు మాకేమాత్రము అక్కరలేదు అనుకుంటున్నారు. అయితే చెడ్డ తలంపులుండే దుర్యోధన, దుశ్శాసనాదుల పేర్లు పెట్టుకోటంలేదుగానీ వారి తలంపులు నిండుగా కాళ్ళనుండి తలవరకు ఉంటున్నాయి. ఏమి ప్రయోజనం చెప్పండి? ఒకదానిని మనము విశ్వసించినప్పుడు రెండవదానిని కూడ విశ్వసించటానికి తగిన ప్రయత్నం చేయాలి.

**మనక్రియలు పవిత్రముగా ఉండాలి**

తరువాత, చెడ్డ చూపులు. కీచకుడు మహా పతివ్రతామతల్లియైన, మహా సాధ్వియైన

sri sathyasai vachanamrutam

ద్రౌపదిని చెడ్డ చూపులు చూశాడు. అలాంటి కీచకునికి యేగతి పట్టింది? తలను బ్రద్దలు చేశాడు, భీముడు. ఈనాడు కీచకుని పేరు పెట్టుకోటానికి ఎవరు యిష్టపడరు. కీచకుడని మగవారిలో పేరు ఉంటున్నదా? ఈ విధముగా నిత్య జీవితములో జరిగే ప్రతి విషయంలో చెడ్డతలంపులు, చెడ్డమాటలు, చెడ్డవినికిడి, చెడ్డ చూపులు యివన్నీ మానవునకు విరుద్ధమైనవనే సత్యాన్ని మనకు నిరూపణ చేస్తున్నాయి. రామాయణ, భారత, భాగవత, యితిహాస పురాణములయందు పవిత్రమైన మార్గమును ప్రబోధిస్తున్నాయి. మన నడతలు మంచివిగా ఉంటుండాలి. ఫలానా వ్యక్తి మంచి, చెడ్డ అని వాని స్వరూపమును చూచి మనము చెప్పలేము. ఇది అసాధ్యము. తన నడతనుబట్టి మంచిగా ఉంటే 'యితను చాలా మంచివాడండి' అంటాము. చెడ్డగా ఉంటే 'దుర్మార్గుడు' అంటాము. వాని పనులను బట్టి వాని మంచి చెడ్డలను నిరూపణ చేస్తున్నాము. కనుక, మన క్రియలు పవిత్రమైన క్రియలుగా ఉండాలి.

**మానవత్వమనగా పవిత్రత అని అర్థము**

నారాయణుడు ఎవరు? నరుడే నారాయణుడు. 'నర' అనగా ఆత్మ. ఆత్మ నుండి ఆకాశాది భూతములు. ఆకాశాది భూతములకంతా నారములని పేరు. నారములనగా జీవులని అర్థము. జలమని అర్థము. ఈ నారములకు నిలయమైనది కాబట్టి నారాయణుడని పేరు వచ్చింది. కనుక, నరుడే నారాయణుడు. మానవత్వములో యెంత పవిత్రత ఉంది! మానవత్వమనగా దానికి పవిత్రత అని అర్థము. మనము పవిత్రమైనవారము. అందువలననే 'జంతూనామ్ నరజన్మ దుర్లభమ్' అని చెప్తారు. మానవ జన్మము దుర్లభమైనది. దీనిని నిరర్థకము చేసుకోరాదు. దుర్మార్గములో ప్రవేశించరాదు. సాధ్యమైనంతవరకుకూడను 'పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనమ్'. అష్టాదశ పురాణములందు యీ రెండింటినే మనము ప్రధానముగా తీసుకున్నాము. "ఒకరికి ఉపకారము చేయటానికి వీలుకాకపోతే నోరు మూసుకుని కూర్చో. అపకారము చేయవద్దు. అపకారము చేయకుండా ఉండటమే గొప్ప ఉపకారము", అని ప్రబోధించారు. ఇలాంటి సత్యాలు ఎన్నో వేలకు, లక్షలకు ఉంటున్నాయి. వాటిని యేమాత్రము మనము విశ్వసించటం లేదు.

**మోహక్షయమే మోక్షము**

srisathyasaivachanamrutam

అనేకమంది 'మోక్షము, మోక్షము' అని అంటుంటారు. ఈ మోక్షమంటే ఏమిటి? కొందరు దీనిని నాకు అక్కరలేదయ్యా అంటారు. ఉదాహరణకు నాస్తికుడు అక్కరలేదంటాడు. కమ్యూనిష్టులు మాకక్కరలేదంటారు. అయితే, ఎవరికీ అక్కరలేదని చెప్పటానికి వీలులేదు. కారణము ఏమిటి? మోక్షము అనే పదమునకు అర్థము తెలుసుకుంటే వారు ఇలా అనరు. ఎటువంటివాడు కూడా నాస్తిక, ఆస్తికులు ఎవరూ కూడా మోక్షము వద్దంటానికి వీలులేదు. యోగి, భోగి, విరాగి, బైరాగి ఎవ్వరూ నాకు వద్దనటానికి వీలుకాదు. కారణమేమిటి? మోక్షము అంటే శాశ్వత దుఃఖ నివృత్తి, ఆనందప్రాప్తి. నాకు ఆనందము వద్దని ఎవరైనా చెబుతారా? లేక నాకు దుఃఖము కావాలని ఎవరైనా చెబుతారా? చెప్పలేరు. దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి అదే మన ఆశ. ఆనందప్రాప్తిని ఆశిస్తున్నాడు. యిదే నిజమైనది. 'మోహక్షయమే మోహము' అన్నారు. మోక్షమును క్షయం గావించాలి. అప్పుడే నిజమైన మోక్షము. మోక్షమనేది ప్రత్యేకముగా ఒక పెద్ద air condition room కట్టేసి అక్కడ అందరిని ఉంచి సర్వసుఖాలు, భోగాలు అనుభవించటము కాదు. అదికాదు, మోక్షము. మన జీవితములోనే ఉంటున్నాది మోక్షము. మన తత్త్వమును మనము గుర్తించుకోవాలి. తనను తాను అర్థం చేసుకుంటే అదే మోక్షం. ఇలాంటి సత్యాన్ని సులభమైన మార్గములో మనము తీసుకోవాలి, బంగారూ!

## ప్రేమయే దైవము, దైవమే ప్రేమ

ఎన్నో ఉపనిషత్తులు చదువుతాం. ఎన్నో పురాణాలు చదువుతాం. భగవద్గీత పఠిస్తాము. ఇవన్నీ మనము కేవలము కాలమును సార్థకము గావించి కర్మద్వారా చిత్తశుద్ధిని గావించుకొనే నిమిత్తము మాత్రమే గానీ దీనివలన మోక్షము మనకు యేనాడు లభించదు. ఈ ఆశలు మీరుపెట్టుకోకండి. చేయవలసిన పనులు మంచిగా చేయండి. అదే ముఖ్యమైనది. పనులు మాత్రం చెడ్డవి చేస్తూ ఎన్ని వేదాంతములు పఠిస్తే, ఎన్ని సాధనలు చేసి యేమి ప్రయోజనం చెప్పండి? చిల్లులు పడిన పాత్రలో ఎంతనీరు నింపినా అది ఎప్పుడూ కారిపోతూనే ఉంటుంది. అదికాదు. హృదయ పాత్ర మొట్టమొదట భద్రం చేసుకోండి. ఆ విధమైన భావముతో ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. ప్రేమకంటె మించినది మరొకటి లేదు. ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. సర్వులను మనం ప్రేమించాలి. ఎందుకంటే అందరియందు ఉన్నది

srisathyasai vahini

ప్రేమస్వరూపమే! కనుక, ఎవ్వరిని మనము ద్వేషించరాదు. ఈసాయి సంస్థలవారిని గాని మరి యే ఇతర సంస్థలవారినిగాని మనము ద్వేషించటానికి ప్రయత్నించరాదు. అందరియందు దైవత్వము ఉంది. అనేకమంది చెప్తూతూ ఉంటారు, 'కొన్ని సమయాల లోపల పెడమార్గము పట్టవలసి వస్తుంది', అని. పెడమార్గము పట్టటానికి అవకాశమే లేదు. కారణము ఏమిటి? మనము సరైన మార్గములోనే ఉంటుండాలి. సరైన మార్గము మనము చూచుకుంటూ ఉండినప్పుడు పెడమార్గము ఏనాడూ ప్రయత్న పూర్వకముగా రాదు. ఎవరిని మనం ద్వేషించకూడదు. తన దైవమును తాను ద్వేషించినట్టవుతుంది. ఎవరితోను కఠినమైన మాటలు అనకూడదు. వారి హృదయాన్ని గాయపరచినట్టవుతుంది. ఇనుము విరిగితే అతికించవచ్చుగానీ మనసు విరిగితే అతికించటానికి వీలుకాదు. కనుక, మనస్సును కష్టపెట్టటానికి యెవ్వరుకూడను అంగీకరించకూడదు.

**ప్రతి ఒక్కరు భగవదంశమే!**

ముఖ్యముగా మనసంస్థలయందే క్రమశిక్షణ చాలా అవసరము. ఈ క్రమశిక్షణ జీవితానికే చాలా ప్రధానమైనది. మనము క్రమశిక్షణలో చక్కగా ఉంటుండాలి. గృహస్థ ధర్మాన్ని చక్కగా నిర్వర్తించుకోవాలి. మన పిల్లలను మనం చక్కగా పెంచుకోవాలి. మన పిల్లలకు మంచి గుణములు నేర్పటానికి ప్రయత్నించాలి. ఇది తల్లి తండ్రుల ప్రధాన కర్తవ్యము. ఈనాడు ఏమి చేస్తున్నారు? చిన్న ఉదాహరణము. పట్టణములలో ఎక్కువగా ఉంది. పల్లెలలో చాలా తక్కువగా ఉంది. బిడ్డను కన్న తక్షణమే తల్లి ఆయాకో, నర్సుకో అప్పచెబుతుంది. అమ్మగారు యిష్టము వచ్చినట్లు తిరుగుతుంది. తల్లియొక్క పోషణచేత, తల్లియొక్క స్పర్శచేత, తల్లియొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములచేత బిడ్డకు ఆయుఃప్రమాణము అధికమైపోతుంది. ఈ రహస్యమును యెవరూ గుర్తించటము లేదు. బిడ్డను ప్రక్కనపెట్టుకొని ఆ తల్లి హస్తము ఉంటుంటే ఆ బిడ్డయొక్క క్షేమము యెంతో అభివృద్ధి అవుతుంది. ఈనాడు ఏమవుతున్నాది? ఆయా చేతికో, నర్సుచేతికో, దాసిచేతికో యిచ్చేస్తున్నారు. ఈ నర్సులు, ఆయాలు వారి భావాల్లో వారు చూసుకుంటారుగాని బిడ్డయొక్క యోగక్షేమము వారు చూసుకోరు. ధనం కోసమని, జీతము కోసమని వారు చూచుకోవచ్చు. కట్టకడపటికి ఆయాచేత అభివృద్ధి గాంచటంచేత ఆయా ఛస్తే యేడుస్తాడు

srisathyasaivachanamrutam

గాని అమ్మ ఛస్తే ఏడ్చుడు. ఇలాంటి పరిస్థితికి వచ్చేస్తున్నారు. బిడ్డలను యీరీతిగా పెంచకూడదు. నిరంతరము తల్లితోనే ఉండాలి బిడ్డ. తల్లి లేక బిడ్డ ఉండలేదు. చెట్టు అంశమే కొమ్మ. చెట్టునుండి కొమ్మ వేరుచేస్తే కొమ్మ బ్రతకలేదు. జలముయొక్క అంశమే చేప. జలము విడచి చేప ఒక్కక్షణమైనా ఉండలేదు. అదేవిధముగా నారాయణుని అంశమే నరుడు. నరుడు, నారాయణుని వదలి ఒక్కక్షణమైనా ఉండలేడు. ఇలాంటి అంశతత్త్వమును మనము పోషించుకుంటూ రావాలి. ప్రతిఒక్కడు భగవదంశమే.

**విశ్వాసము లేక క్షణమైనా ఈ జగత్తులో నివసించలేము**

ఈ సత్యమును మనము గుర్తించాలి, విశ్వసించాలి. విశ్వాసమే చాలా ప్రధానమైనది. విశ్వాసములేని జీవితము శ్వాసలేని జీవితమే అయిపోతుంది. కొంతమంది నాకు భగవంతునిపైన విశ్వాసము లేదంటారు. సరే! భగవంతునిపైన విశ్వాసము లేకుండా పోవచ్చుగాని, నీపైన నీకు విశ్వాసము ఉందా? తనను తాను నమ్మనివాడే భగవంతుని నమ్మడు. పుట్టపర్తికి వచ్చావు. రేపటి దినము బెజవాడ పోయి చేరుతాను అనే నమ్మకము లేకపోతే నీవు బస్సులోనే కూర్చోలేవు. మార్కెట్టుకు పోయి కూరగాయలు తీసుకు యింటికి వస్తాను అనే నమ్మకమే లేకపోతే నీవు బజారుకే పోలేవు. తిరిగి నేను సాయంకాలము యింటికి వచ్చి చేరుతాను అనే నమ్మకమే లేకపోతే నీవు ఆఫీసుకే పోలేవు. ఇవన్నీ నమ్మకముతో చేస్తున్నారా, అపనమ్మకముతో చేస్తున్నారా? ప్రతి దానిపైన నమ్మకము ఉంటున్నాది. ఈనాడు అమావాస్య అని తర్పణములు వదలిపెడుతున్నాము. ఈనాడు అమావాస్య అని బోర్డురాసుకొని వస్తున్నదా ఆ దినము? లేదే! ఈనాడు ఏకాదశి అనుకుంటే ఎక్కడ ఉంది? ఒక సిద్ధాంతి యీనాడు ఏకాదశి అని పేరుపెట్టంచేత మనము అనుసరిస్తున్నాము. ఆ సిద్ధాంతిని అనుసరిస్తున్నాము. భగవంతునియొక్క తత్త్వము 'తత్త్వమసి', 'ప్రజ్ఞానం బ్రహ్మ', 'అయమాత్మ బ్రహ్మ', 'అహంబ్రహ్మాస్మి' అని వేదవాక్కు దృఢముగా 'నీవేదైవము నాయనా', అని చెబితే నమ్మటం లేదు. చూడండి, మానవత్వము యెంత దిగజారిపోతున్నది! తనను తాను నమ్మినవాడు యీవిధమైన విశ్వాసము అభివృద్ధి చేసుకోవాలి. ఈ విధమైన విశ్వాసమే లేకపోతే క్షణమైనా జగత్తులో ఉండటానికి వీలులేదు.

**ఐకమత్యమే నిజమైన బలము**

srisathyasaivachanamrutam

ప్రేమ స్వరూపులారా! భగవత్ తత్త్వమును మీరు అనుభవించటమేకాకుండా యితరులకు యీ సత్యాన్ని, యీ ప్రేమను అందించటానికి ప్రయత్నించాలి. అందుకున్న పదార్థము స్వార్థముగా ఒకరే భుజించరాదు. కాకులు చూడండి, ఎక్కడైనా ఒక కాకి మెతుకులు చూచిందంటే తానే స్వయముగా వచ్చి పొట్టనింపుకొని వెళ్ళిపోదు. చుట్టూ తిరుగుతుంది. 'కావ్, కావ్' మని అన్ని కాకులను పిలుచుకు వచ్చి అన్నీ కలసి ఆ మెతుకులను తిని వెళ్ళిపోతాయి. కాకులలో యింత ఐకమత్యము ఉంటుండాది. చీమలకు ఎక్కడైనా యింతతీపి కనుపించిందంటే తమ పొట్టనిండా తిని అక్కడే పడిపోవు. తిరిగి తన పుట్టకు పోయి అన్ని చీమలకు చెప్పి అన్ని చీమలను తీసుకువచ్చి ఆ ఉన్న ఆహారమును విభాగము చేసుకొని అన్నీ అనుభవించి పోతూ ఉంటాయి. కాకుల్లో ఉంది ఐకమత్యము. చీమల్లో ఉంది ఐకమత్యము. మానవులలో లేకుండా పోతున్నాది. ఐకమత్యమే నిజమైన బలము. ఒక్కవ్రేలితో ఏపని మనము చేయలేము. ఐదువేళ్ళు చేరినప్పుడే మనము పని చక్కగా చేయగలము. కనుక unity అంటే అన్నీ కలసిమెలసి ఉండే ఐకమత్యము వచ్చినప్పుడే మనలో purity పరిశుద్ధము యేర్పడుతుంది. ఈ purity మనకు వచ్చినప్పుడే divinity దివ్యత్వము మనకు కలుగుతుంది. కాని, ఈనాడు unity లేదు, purity లేదు, divinity లేదు. Community అనగా కులము, మాకులము అని కులాభిమానం పెరిగిపోయింది. ఏమిటి, యీ కులము? నిప్పు ఏకులము? నీటిదేకులము? గాలిదేకులము? గగనానిది ఏకులము? వీటికంతా కులములు లేవే! నిజానికి మన కులము యేమిటి? మానవ కులము. మనజాతి మానవజాతి. అందరు మానవులమే! ఈ సత్యమును మనము మొట్టమొదట గుర్తించుకుంటే యెంతైనా మంచిది. ఈ కులాలు, మతాలు దేహమునకు సంబంధించినవి. 'నేను వృద్ధుడను' అనుకుంటావు. దేహమును బట్టి వృద్ధుడనుకుంటున్నావుగాని లేకపోతే యీ వృద్ధత్వము నీకు ఎక్కడనుంచి వచ్చింది! నేను బాలుడను అని ఒకరు చెబుతారు. ఈ బాలుడనేది కూడ దేహమును బట్టి వచ్చిందేగాని, వేరే ఎక్కడనుండి రాలేదు. దీనికొక ప్రత్యేకత లేదే! కనుక, దేహమునుబట్టి మనకు యీ కులములు, మతములు, భావములు, వర్ణములు వచ్చాయి. నిజముగా ఆత్మకు ఎట్టి కులము లేదు. ఒకే కులము, అదే మానవత్వము, అదే దివ్యత్వము, అదే దైవత్వము.

**విశాలత్వములోనే ఆత్మతత్త్వము ఇమిడిఉంటున్నది**



sri sathyasai vahinimrutam

ఈ దైవత్వమును చక్కగా మనము విశ్వసించి యేది చేసినా ప్రతికర్మ దైవప్రీత్యర్థముగా మనము చేయాలి, బంగారూ! దైవమునకు యేదిప్రీతి అంటే అందరిని ఆనందముగా ప్రేమించటమే ప్రీతి. అందరు సుఖముగా ఉండటమే ప్రీతి. మన భారతీయ సంస్కృతిలో ప్రధానమైనది, హైందవ సాంప్రదాయము. ఏమిటది? 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు.' లోకమంతాకూడను సుఖముగా ఉంటుండాలి. చూడండి, మీరు యేమీ అనుకోకండి. నాకు ఏ పార్టీ లేదు. 'విశ్వహిందూ పరిషత్', అంటారు. వేరే యింకో పరిషత్ అంటారు. హిందువులకు మాత్రమే దేవుడు, బయటవారికి దేవుడు లేడా? 'ఈశ్వరస్సర్వ భూతానామ్' అన్నారు గాని 'ఈశ్వర హిందూ భూతానామ్' అని చెప్పలేదే! అన్ని దేశములవారు మనుష్యులే! వారి రూపము, వారి రంగులు, వారి వేషములు వేరు వేరుగా ఉండవచ్చును గాని అందరూ మానవులే కదా! ఆకలివేస్తే అందరూ తింటారు. ఏడుపువస్తే అందరూ ఏడుస్తారు. కోపం వస్తే అందరూ కోప్పడతారు. మానవత్వము అందరికి ఉంటుండాది. దీనిని సమత్వముగా మనము అనుభవించాలి. సమత్వముగా భావించటమే నిజమైన భక్తిగాని ఏదో వారిపైన వీరు, వీరిపైన వారు ద్వేషము పెట్టుకొంటే యిది సరైనది కాదు. ఇవి సంకుచితమైన భావములు. విశాలమైన భావములు రావాలి మనకు. చిన్న ఉదాహరణ చూడండి. బెలూన్ అంటారు, పిల్లలు. దాంట్లో గాలి ఊదుతారు. గాలి ఊదితే పెద్దదవుతుంది. కట్టివేసినపుడు బెలూన్‌లో ఉండే కొంచెము గాలి మాత్రమే అందులో ప్రత్యేకముగా ఉంటున్నాది. కాని విశాలమైనగాలి సర్వత్ర వ్యాపించినది. ఈ సర్వత్ర వ్యాపించిన గాలిలోపల యీ బెలూన్‌లో ఉన్న వాయువు యేకం కావాలంటే యేమి చెయ్యాలి? దానిని వూదాలి. వూదుతూ వూదుతూ ఉంటే ఒకసారి ఫట్ మని పగిలిపోతుంది. పగిలి అందులోని గాలి విశాలమైన గాలిలో యేకమైపోతుంది. 'నేను, నావారు', 'నేను, నావారు' అనే ఒక బెలూన్‌లో గాలి మాదిరి మనం ఊదుకొందాం. వూది, వూది, అది బాగా అభివృద్ధి గాంచినప్పుడు అదే విశాలమైన దాంట్లో జేరిపోతుంది. సంకుచితమైన మైండ్ ఫట్‌మని పేలిపోతుంది. అదే హృదయగ్రంధి ఛేదించటమని. ఆ విధముగా విశాలము కావాలి. ఆ విశాలత్వములోనే మన నిజమైన ఆత్మతత్త్వము యిమిడి ఉంటున్నది, బంగారు!

భక్తి, భక్తి అనుకుంటూ జపములు చేస్తాం, ధ్యానము చేస్తాం, అర్చన చేస్తాం, యివన్నీ మన కాలమును పవిత్రము గావించుకొనే నిమిత్తమే! నిజముగా భగవంతునిపై మనకు విశ్వాసము

sri sathyasai vahamrutam

లేకపోతే అవన్నీ మనము చేయము. ఆ విశ్వాసమును పెట్టుకోండి. విశ్వాసమునకు, ప్రేమ ప్రధానము. ప్రేమ ప్రాణము. ప్రేమ లేకపోతే యేదీ మనము చేయలేము, బంగారు! కనుక, ప్రేమచేతనే మనము యీ జీవితమును సార్థకము గావించుకొని ప్రేమచేతనే అనేకత్వమైన మానవత్వమును ఏకత్వము గావించుకోటానికి తగిన ప్రయత్నము చేయండి.

**(తేదీ. 20-06-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam